తెరపైకి ప్రత్యేక మున్సిపాలిటీ

- ఏకతాటిపైకి వార్డు కౌన్సిలర్లు
- త్వరలో ఉద్యమ కార్యాచరణకు యత్నం

జడ్చర్ల టౌన్: జడ్చర్ల మున్సిపాలిటీలో ప్రత్యేక పంచాయతీ మళ్లీ తెరపైకి వచ్చింది. ఉమ్మడి మున్సిపాలిటీలో తమకు అన్యాయం జరుగుతోందని 'మా పాలన మాకే కావాలి' అంటూ జడ్చర్ల, కావేరమ్మపేటకు చెందిన వార్డు కౌన్సిలర్లు ఏకతాటిపైకి వచ్చి ఉద్యమ కార్యాచరణకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అందులో భాగంగానే మూడు రోజుల క్రితం జరిగిన బడ్జెట్ సమావేశంలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దాంతో పట్టణంలో ప్రత్యేక చర్చ మొదలైంది. 2012కు ముందు బాదేపల్లి, జడ్చర్ల రెండు జంట మేజర్ గ్రామ పంచాయతీలుగా కొనసాగాయి. ఆ తరువాత జరిగిన పరిణామాల్లో రెండు కలిపి మున్సిపాలిటీగా మార్చారు. కొన్ని పోరాటాల తరువాత బాదేపల్లి ఒక్కటే నగర పంచాయతీగా మార్చారు. ఆ తరువాత రెండు గ్రామ పంచాయతీలుగా కొనసాగించారు. 2014లో తిరిగి బాదేపల్లి నగర పంచాయతీ, జడ్చర్ల గ్రామ పంచాయతీగా మార్చారు. ఈ క్రమంలో జడ్చర్ల పంచాయతీకి 2016లో ఎన్నికలు జర్గగా బాదేపల్లికి మాత్రం ఎన్నికలు జరగలేదు. ఆ తరువాత 2018లో మరోసారి రెండింటిని కలిపి బాదేపల్లి మున్సిపాలిటీగా మార్చారు. కొద్దిరోజులకే జడ్చర్ల మున్సిపాలిటీగా మార్చారు. అయినప్పటికి నేటికీ బడ్జియాప్‌లో మాత్రం బాదేపల్లి పేరు ఉండటం గమనార్హం. ఈ క్రమంలో 2021 వరకు గ్రామ పంచాయతీ పాలక వర్గం గడువు ఉండటంతో ఆ గడువు ముగిశాక ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. ఈ కారణంగా 2021ఏప్రిల్ జడ్చర్ల మున్సిపాలిటీకి ఎన్నికలు జరిగాయి. అనేక పర్యాయాలు ఉద్యమాలు జరిగి ప్రత్యేక పోరు కొనసాగటంతో ఎన్నికలు సకాలంలో జరగలేదు. దీంతో కేంద్ర నిధుల విడుదలలో కొంత నష్టం జరిగింది. రెండు కలిపి మున్సిపాలిటీ చేసిన సమయంలోనే ప్రత్యేక పోరు ఉన్నప్పటికి అప్పటి ఎమ్మెల్యే డా.లక్ష్మారెడ్డి సూచనలతో ఉద్యమాన్ని నిలిపేశారు.



జడ్చర్ల మున్సిపాలిటీ కార్యాలయం



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కౌన్సిలర్లు (ఫైల్)

మళ్లీ తెరపైకి ప్రత్యేక పోరు

2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి పాలవటం, కాంగ్రెస్ అధికారంలోకి రావటం జరిగింది. ప్రచారం చేస్తున్న సమయంలో కావేరమ్మపేట చావిడి వద్ద ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తాను గెలిస్తే జడ్చర్ల, కావేరమ్మపేటలను ప్రత్యేక మున్సిపాలిటీ చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆయనే అధికారంలో ఉండటంతో వార్డు కౌన్సిలర్లు తమ అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నారు. జడ్చర్ల, కావేరమ్మపేటల్లో వనరులు అధికంగా ఉన్నాయని, 21వేల ఓట్లు, 45వేలకు పైగా జనాభా ఉందని వారు చెబుతున్నారు. జడ్చర్ల, కావేరమ్మపేటల్లో మొత్తం 9వార్డులుండగా ముగ్గురు కాంగ్రెస్, 6గురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఉన్నారు. వీరంతా ముక్తకంఠంతో ప్రత్యేకం కోరటం గమనార్హం. ముడానిధుల కేటాయింపు, టీయూఎఫ్ఐడీసీ నిధులలో తమ గ్రామాలకు అన్యాయం జరిగిందని వాపోతున్నారు. నిన్నటి వరకు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా జడ్చర్ల 8వ వార్డు కౌన్సిలర్ దోరేపల్లి లక్ష్మి కొనసాగారు. ఇటీవల బాదేపల్లి 14వ వార్డు కౌన్సిలర్ పుష్పలత చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. వైస్‌చైర్‌పర్సన్‌గా పాలాది సారిక కావేరమ్మపేటకు చెందినప్పటికి బాదేపల్లి 15వ వార్డు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్ ఇద్దరు బాదేపల్లి వారే అన్న వ్యతిరేకభావన వార్డుకౌన్సిలర్లలో ఏర్పడింది. వీటితోపాటు ఇటీవల మున్సిపాలిటీలో జరుగుతున్న కొన్ని పరిణామాలు, భువనయాప్ రివిజన్‌కు నోచుకోకపోవటంతో ఇంటియజమానుల పేరు మార్పిడి జరగకపోవటం వంటి అనేక కారణాలతో తెరపైకి ప్రత్యేక మున్సిపాలిటీ వచ్చినట్లయ్యింది. బీఆర్‌ఎస్ అధికారంలో లేకపోవటం సైతం కౌన్సిలర్ల మనోభావాలు వ్యక్తీకరించే ఆస్కారం ఏర్పడింది. ప్రత్యేక పోరులో భాగంగా త్వరలోనే ఎమ్మెల్యేను కలిసి తమ అభిప్రాయాలను వెల్లడించటంతో పాటు ఉద్యమ కార్యాచరణకు పార్టీలకు అతీతంగా అఖిలపక్షం ఏర్పాటు చేయనున్నట్లు వార్డుకౌన్సిలర్లు తెలిపారు. మరోవైపు బాదేపల్లిలోనూ అన్ని పార్టీల నాయకులు ప్రత్యేకంపై చర్చించుకుంటున్నారు.

క్లుప్తంగా

అన్నదాత సుఖీభవ



నవాబుపేట: ఆకలితో వచ్చిన వారికి అన్నపెట్టి కడుపునింపుతున్న అన్నదాతకు జనాలు అన్నదాత సుఖీభవ అంటూ దీవిస్తూ భోజనం చేస్తున్నారు. మండల కేంద్రంలో ఆదివారం సంతకు వచ్చే జనాల కోసం ప్రతి ఆదివారం అందిస్తున్న ఉచిత భోజన కార్యక్రమం నేటితో 26 వారాలుగా నిరాటంకంగా కొనసాగుతోంది. నిత్యం భోజనం చేస్తున్న వారు అన్నదాతను దీవిస్తూ ఈ కార్యక్రమం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జనాల ఆకలి తీర్చేందుకు మండల కేంద్రానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి సంతకు వచ్చే వారికోసం ఉచిత భోజన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం గత ఏడు నెలలుగా నిరంతరంగా కొనసాగతోంది. ప్రతి వారం 500 మందికి తగ్గకుండా భోజనం చేస్తున్నారు. అన్నదాన కార్యక్రమంలో వ్యాపార సంఘం మండల అధ్యక్షుడు సుధాకర్‌చారి, పుట్టి ఆంజనేయులు, రఘువీర్ శర్మ, నిరంజన్, చందు, నసీర్, వెంకటయ్య పాల్గొన్నారు.

భాగ్యనగర్ కాలనీ సంక్షేమ కమిటీ ఎన్నిక



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: భాగ్యనగర్ కాలనీ సంక్షేమ కమిటీ కొత్త కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాడెమోని నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా కమ్మలి వెంకటేష్, కోశాధికారిగా బోరెల్లి శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా పి.కాశన్న, ఉపాధ్యక్షులుగా బ్యాగరి శివరాములు, శ్రీశైలం, బి.సుదర్శన్‌యాదవ్, సత్యం, కార్యనిర్వాహక కార్యదర్శిగా చికిరాల పట్టాభి, కార్యవర్గ సభ్యులుగా సానె నరేందర్, పర్వతాలు, ఎన్.వెంకటస్వామిశెట్టి, గురుబ్రహ్మం, శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ భాగ్యనగర్ కాలనీ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయురాలికి అభినందన


దేవరకద్ర: మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయురాలు పులి జమున ఆతరం రచయిత్రుల జీవన ప్రస్థానంపై ఈ తరం రచయిత్రులు సమర్పించిన పత్ర సమర్పణకు ఆదివారం అభినందన పత్రం అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అక్షరయాన్ ఉమెన్ రైటర్స్ ఫోరం, సీతాస్ చారిటబుల్ ట్రస్ట్, అభిజ్ఞభారత్ సంయుక్త నిర్వహణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయురాలిగా పిల్లల్లోని నైపుణ్యాలను వెలికి తీస్తూ బాలలతో అనేక రచనలు చేయించినందుకు ఆమెను ప్రశంసించారు.

దేవరకద్ర మహిళకు సన్మానం



దేవరకద్ర: మండల కేంద్రానికి చెందిన దూగురు విశ్వప్రభను హైదరాబాద్ ఉప్పల్‌లోని శ్రీసాయి త్రిశక్తి ఆలయంలో బ్రహ్మణ సంక్షేమ వేదిక, విప్ర వాగ్దేవి వైభవం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించి మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా వేదికపై మహిళలకు నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రకు చెందిన విశ్వప్రభ ప్రతిభ చూపారు. దీంతో ఆమెను ఎంపిక చేసి రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ బీజేపీ అధికార ప్రతినిధి సుహాసిని చేతుల మీదుగా సన్మానం చేశారు.

మైసమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. వ్యవసాయ పనులు లేకపోవడంతో రైతులు, వ్యవసాయ కూలీలు ఆర్టీసీ బస్సులతో పాటు, ప్రైవేట్ వాహనాల్లో తరలివచ్చారు. 10 వేల మంది భక్తులు హాజరై మైసమ్మ దేవతను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేశారు. భక్తులను చేరవేసేందుకు ఆర్టీసీ సంస్థ వారు ప్రత్యేక బస్సులను నడిపారు.

ఉర్దూ మీడియం అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉర్దూ మీడియం అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభించాలని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఫారుఖ్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి అమలు చేయలేదని పేర్కొన్నారు. సంగారెడ్డిలో భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీతో సమావేశమైన సందర్భంగా అప్పటి టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి తమ సంఘం తరపున వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అన్ని జిల్లా కేంద్రాల్లో ఉర్దూ మీడియం అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభించాలని ఆయన కోరారు.

కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం



మహబూబ్‌నగర్ న్యూటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మందుల ధరలు పెంచి కార్పొరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి మండిపడ్డారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మెడికల్ రిప్రజెంటేటివ్స్ జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. సామాన్య ప్రజలు వాడే మందుల ధరలు అందుబాటులో లేకుండా కార్పొరేట్ ఫార్మా కంపెనీలకు దేశ సంపదను కట్టబెట్టిందన్నారు. శ్రమ జీవులకు వచ్చే రోగాలను కాపాడే మందుల ధరలను 100శాతం పెంచే రకంగా కంపెనీలకు అనుమతించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మందుల ధరలు తగ్గించాలని, కేంద్ర బడ్జెట్‌ను సవరించాలని, లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా బహుముఖ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శోభన్ మాట్లాడారు. మెడికల్ రిప్రజెంటేటివ్స్ హక్కులకో పోరాటం చేస్తూనే ప్రజల ఆరోగ్యం కోసం మందుల ధరలు తగ్గించాలని సంఘం పోరాటం చేస్తుందన్నారు. జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, భాను, రాఘవేందర్, శ్రీకాంత్, అమరేందర్, నవీన్, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం



మద్దూరు: మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైనట్లు నిర్వహకులు తెలిపారు. నారాయణపేటకు చెందిన పీఎస్ సునంద మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఎముకలు, కీళ్లకు సంబంధించిన వ్యాధులపై డాక్టర్ ఎం. ప్రసాద్‌శెట్టి, డాక్టర్ దీపాక శెట్టి వైద్య సేవలు అందించారు. మారుమూల గ్రామాలకు హాస్పిటల్ తరపున వైద్యం అందాలనే ఉద్దేశంతో మద్దూరులో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు వైద్యులు తెలిపారు. 400 మంది రోగులకు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఆప్షన్ సభ్యుడు సలీం, మాజీ సర్పంచ్ అరుణ, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు విజయ్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలి



ధర్నాకు బయలుదేరుతున్న సీపీఎస్ ఉద్యోగులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి, కార్యదర్శి చంద్రకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జెడ్పీ కార్యాలయం నుంచి చలో ఇందిరాపార్క్ ధర్నాకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 24న కేంద్ర ఆర్థికశాఖ విడుదల చేసిన గెజిట్ ప్రకారం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ 1 ఏప్రిల్ 2025 నుంచి అమలు చేయాలని గెజిట్‌లో పేర్కొన్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు సీపీఎస్ యూపీఎస్ వంటి పెన్షన్ పథకాలతో ఉద్యోగ ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. గత పదిహేనేళ్లుగా సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ ఇవ్వాలని పోరాటం చేసి గ్రాడ్యూటీ, ఫ్యామిలీ పెన్షన్ సాధించుకున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ వెంకటేష్, జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, జిల్లా బాధ్యులు రాఘవేందర్ రెడ్డి, మల్లేష్, రాజేష్, కృష్ణారెడ్డి, ఖాదర్, శ్రీనివాస్‌రెడ్డి, కేశవరెడ్డి, రమేష్, కవిత, మండల నాయకులు, సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాత్రి వేళ ఇసుక అక్రమ రవాణా

భూత్పూర్: మండలంలోని కర్వెన, పాతమొల్గర, రావులపల్లి, కప్పెట గ్రామాల్లో రాత్రివేళల్లో ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. పురపాలికలోని అమిస్తాపూర్ సమీప తండాల్లో ఫిల్టర్ల ఇసుక, కర్వెన చుట్టుపక్కల తండాలతో పాటు ప్రాజెక్టు పరిసరాల్లో ఫిల్టర్ ఇసుక తయారీతో పాటు రాత్రికి రాత్రే బెంజ్ వాహనాల్లో తరలిస్తున్నారు. మూసాపేట, అడ్డాకుల మండలాల్లోని శివారులోని వాగుల నుంచి భూత్పూర్, కొత్త మొల్గర, ఎల్కిచర్ల మీదుగా నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి, మంగనూరు మినీ డీసీఎంలల్లో ఇసుక రవాణా మధ్యరాత్రి నుంచి తెల్లవారుజామున వరకు సాగుతుంది. కొత్తమొల్గర, పాత మొల్గర మధ్య సమీప వాగులో నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చి రాత్రికి రాత్రే బెంజ్ లారీల్లో తరలిస్తున్నారు. అమిస్తాపూర్‌లో మట్టిని ఫిల్టర్ చేసి ప్రతి నిత్యం రాత్రి వేళల్లో ఇసుక తరలిస్తున్నారు. రావులపల్లి గ్రామంలోని బ్రిడ్జి వద్ద మూడునెలల క్రితం ఇసుకను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు, నేటికిని ఇసుక డంపును టెండర్ వేయకుండా రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. పోలీసులు, రెవెన్యూ సమన్వయంతో ఇసుక ఫిల్టర్లు, అక్రమ ఇసుక రవాణాపై చర్యలు తీసుకోకపోవడంతో ఇసుక మాఫీయా మండలంలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకొని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కొత్త మొల్గర సమీపంలోని ఇసుక డంప్ నుంచి తరలించిన మిగిలి ఇసుక

మసీదులో రంజాన్ ప్రత్యేక ప్రార్థన

భూత్పూర్: పురపాలికతో మండలంలోని వివిధ గ్రామాల్లో ముస్లింలు ఆదివారం తెల్లవారుజామున నుంచి ఉపవాస దీక్షలు చేపట్టి మసీదుల్లో ప్రత్యేక ప్రార్థన ఆరంభించారు. పట్టణంలోని జామా మసీద్, మదీనామసీదులలో శనివారం రాత్రి ముస్లింలు ప్రత్యేక ప్రార్థన చేశారు. మసీద్ కమిటీల అధ్యక్షుడు మహ్మద్ సాదిక్, నిర్వహకుడు మహ్మద్ సాదిక్, మహ్మద్ ఖదీర్, మహ్మద్ జహంగీర్, మహ్మద్ హాజీ, మహ్మద్ ఆరిఫ్ హుస్సేన్ మసీదులలో రంజాన్ ప్రారంభం సందర్భంగా ఏర్పాట్లు చేశారు.

బాదేపల్లి హైస్కూల్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేత

జడ్చర్ల టౌన్: బాదేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆరేళ్ల క్రితం పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు ప్రీపెయిడ్ మీటర్లు అమర్చారు. వాటిలో బాదేపల్లి జెడ్పీహైస్కూల్, తహసీల్దార్ కార్యాలయం, డిగ్రీ కళాశాల, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఎంపీడీఓ కార్యాలయం, బీసీ మహిళ హాస్టల్ భవనాలున్నాయి. మొబైల్, టీవీలు ముందుగా రీచార్జి చేసుకున్నట్లుగా విద్యుత్ మీటర్లను సైతం ముందుగా రీచార్జ్ చేసుకుంటేనే విద్యుత్ సరఫరా కొనసాగుతుంది. అయితే ప్రీపెయిడ్ మీటర్ల నిర్వహణ బాధ్యతలను ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. ఆ సంస్థ కొద్దిరోజులుగా నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకుంది. దీంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఇదే క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ బిల్లులు చెల్లించే అవసరం లేకుండా మార్చారు. అందులో భాగంగానే గత నెలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తహసీల్దార్ కార్యాలయాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోగా, ప్రీపెయిడ్ మీటర్లను తొలగించి సాధారణ మీటర్లు అమర్చారు. బాదేపల్లి జెడ్పీహైస్కూల్‌లోనూ రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో రీచార్జ్ చేసుకోలేదు. ఈ విషయమై స్థానిక విద్యుత్ ఏడీ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా, ప్రభుత్వ పాఠశాలలకు కరెంట్ ఉచితంగానే అందించాల్సి ఉందని, ప్రీపెయిడ్ మీటరు తొలగించి సాధారణ మీటర్ అమరుస్తామని తెలిపారు. వేసవి కావటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి విద్యార్థులు, ఉపాధ్యాయులు కొంత అసౌకర్యానికి గురయ్యారు.

శ్రీపాదరావు సేవలు మరువలేనివి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ శ్రీపాదరావు ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. ఆయన జయంతి సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శ్రీపాదరావు జయంతి అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీపాదరావు న్యాయవాదిగా ప్రజలకు మంచి సేవలు అందించారని, ఆయన రాజకీయ ప్రస్థానంలో మొదటిగా సర్పంచ్ గా రెండు సార్లు ఎన్నికై తదుపరి ఉమ్మడి కరీంనగర్ జిల్లా మహాదేవపూర్ సమితి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని చెప్పారు. 1984 ఎన్నికల్లో మొదటి సారి మంథని నుంచి శాసన సభ్యులుగా పోటీ చేసి విజయం సాధించి 3 సార్లు శాసన సభ్యుడిగా ఎన్నికైనట్లు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభ స్పీకర్‌గా పని చేశారని, శాసన సభ నడిపించిన తీరు ఆదర్శప్రాయం అన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: శాసనసభ మాజీ స్పీకర్ పి.శ్రీపాదరావు జయంతిని స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటేశ్వరరావు, ఆర్ఓ మహమ్మద్ ఖాజా, ఆర్ఐ టి.నర్సింహ పాల్గొన్నారు.



శ్రీపాదరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు



శ్రీపాదరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

ఘనంగా దయానంద సరస్వతి జయంతి

జడ్చర్ల టౌన్: స్వామి దయానంద సరస్వతి 201వ జయంతి పురస్కరించుకుని ఆదివారం ఆర్యసమాజం ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. స్వామి జయంతితో పాటు పట్టణ ఆర్య సమాజ 71వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయం మాధవీయం నుంచి ఆర్యసమాజం వరకు శోభాయాత్ర నిర్వహించారు. దయానంద సరస్వతి చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరు ఆచరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆచార్య వేద సింధు, ఆచార్య సోమశేఖర్, పతంజలి యోగాపేట్ తెలంగాణ అధ్యక్షుడు శివుడు, మర్రి కృష్ణారెడ్డి, ఆర్య ప్రతినిధి మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాద్మి శివకుమార్ పాల్గొన్నారు.



ఆర్యసమాజంలో నిర్వహించిన సభలో పాల్గొన్న పండితులు

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మిడ్జిల్: మండలంలోని చిల్వేర్ గ్రామ సమీపంలోని దుందుభీ వాగు నుంచి ఆదివారం ఉదయం అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకోని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

మట్టి టిప్పర్ స్వాధీనం: కేసు నమోదు

రాజాపూర్: మండలంలోని రాయపల్లి రోడ్డులో బ్లూ కోర్టు సిబ్బంది శనివారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, మట్టిలోడ్‌తో వస్తున్న టిప్పర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. రాయపల్లి రోడ్డులో దుందుభీ వాగునుంచి మట్టితో వస్తున్న టిప్పర్‌ను ఆపి అనుమతి పత్రాలు కోరగా, తన వద్ద ఎటువంటి పత్రాలు లేవని డ్రైవర్ శ్రీరాం చెప్పడంతో పోలీసులు టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మట్టిని నింపుకుని ఉదండపూర్ ప్రాజెక్ట్‌లో కృత్రిమ ఇసుకను తయారు చేసేందుకు తీసుకెళ్తున్నట్లు డ్రైవర్ శ్రీరాం పోలీసులకు తెలిపారు. దీంతో ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందంగౌడ్ తెలిపారు.

తపస్ మండల అధ్యక్షుడి ఎన్నిక

అడ్డాకుల: తెలంగాణ ప్రాంతం ఉపాధ్యాయ సంఘం తపస్ మూసాపేట మండల శాఖ అధ్యక్షుడిగా లక్ష్మీకాంత్‌రావును నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్‌కుమార్, బాబునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సంఘం కార్యాలయంలో రాష్ట్ర బాధ్యులు కరుణాకర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించినట్లు చెప్పారు. మండల ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణను ఎంపిక చేసినట్లు తెలిపారు.

నవాబుపేట మార్కెట్‌లో వేరుశనగ రూ.7 వేలు

నవాబుపేట: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఆదివారం వేరుశనగ 7329 బస్తాల ధాన్యం వచ్చింది. గతంలో ఎన్నడూ లేనంతగా ప్రతి ఆది, బుధవారాలు వేలాది బస్తాల వేరుశనగ రావటంతో ధర సైతం భారీగా వస్తోంది. తాజాగా వేరుశనగ క్వింటాలుకు రూ.7002 వచ్చిందని, తక్కువలో రూ.5,489 వచ్చిందని మార్కెట్ కార్యదర్శి రమేష్ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ: ఇరువురికి గాయాలు

మహమ్మదాబాద్: రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన ఆదివారం మండలంలోని నంచర్ల గేట్ సమీపంలో చోటు చేసుకుంది. 108 అంబులెన్స్ సిబ్బంది తెలి పిన వివరాల ప్రకారం.. అంబులెన్స్‌లో ప్రథ మ చికిత్స చేసిన అనంతరం ఒక్కరు శ్రీనివాస్‌కు మెరుగైన చికిత్స కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. మరొకరిని మరో అంబులెన్స్‌లో తరలించినట్లు తెలిపారు.

గ్రామాల్లో అభివృద్ధికి బాటలు



రాజాపూర్(బాలానగర్): పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాలను పట్టించుకోలేదని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించి బాటలు వేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆదిరమణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బాలానగర్ మండలంలోని పెద్దరేవల్లి గ్రామంలో ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.74లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్యగౌడ్, నవీన్‌రెడ్డి, వెంకటయ్య, తిరుమలయ్య, శ్రీనివాస్, సాయిప్రశాంత్ పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డు నిర్మాణానికి మట్టి సేకరణ



చిన్నచింతకుంట: చిన్నచింతకుంట మండలం అమ్మాపురం కురుమూర్తి స్వామి ఆలయం వద్ద ఎలివేటేడ్ కారిడార్, ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అధికారులు ఆలయం వద్ద రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. ఆదివారం అధికారులు మట్టి సేకరణ పనులు చేపట్టారు. డ్రిల్లింగ్ మిషన్ల ద్వారా ముప్పై పీట్ల లోతునుంచి మట్టిని సేకరిస్తున్నారు. అట్టి మట్టి నమూనాలను టెస్టింగ్‌కు పంపనున్నట్లు తెలిపారు. పని వివరాలను ఆలయ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ఈఓ మధనేశ్వరెడ్డిలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కురుమూర్తి స్వామి ఆలయం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అందుకు ఆలయం వద్ద ఘాట్‌రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న మెగా సైన్స్‌మేళా



మరికల్: మండల కేంద్రంలోని ప్రతిభ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన మెగా సైన్స్ మేళా ఆకట్టుకుంది. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల సైన్స్ ప్రయోగాలను పలు పాఠశాలల విద్యార్థులతో పాటు ప్రజా ప్రతినిధులు, నాయకులు సందర్శించారు. మేళాలో ప్రతిభ చూపిన విద్యార్థులను నాయకులు అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ హనుమంతురెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.